క్లుప్తంగా

అమర జవాన్‌కు నివాళి

మర్రిగూడ : పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి శుక్రవారం మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులను పూర్తిగా అంతం చేయాల్సిన బాధ్యత భారత్‌పై ఉందన్నారు. అవసరమైతే తాను కలం వదిలి దేశం కోసం తుపాకి చేత పట్టుకుని సైనిక పాత్ర పోషిస్తానని అన్నారు.

తైక్వాండో కలర్ బెల్ట్‌లు అందజేత


కలర్ బెల్ట్ అందజేస్తున్న మాస్టర్ సుధాకర్

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో శుక్రవారం తైక్వాండో కలర్ బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు మాస్టర్ పట్టెడ సుధాకర్ బెల్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో కోచ్ ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు మృతి

గట్టుప్పల్ : మండల కేంద్రానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు పెద్దగాని యాదయ్య (70) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తిర్నారి వెంకటేశ్వర్లు, సీపీఐ ఎం మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, సీపీఐ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, లాలయ్య సందర్శించి నివాళులర్పించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిట్యాల: టీయూడబ్ల్యూజే(హెచ్–143) చిట్యాల మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కారంపూరి మధు (హెచ్‌ఎంటీవీ), ఉపాధ్యక్షుడిగా బొడిగె విజయ్‌కుమార్(వార్త), ప్రధాన కార్యదర్శిగా వాస రాంమోహన్(వార్త), కార్యదర్శిగా అంతటి శ్రీను(టీవీ9), కోశాధికారిగా చెన్నోజు చంద్రశేఖర్(ప్రజాజ్యోతి)లు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుస్సా శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు మూడ వేణు, చిర్రబోయిన మల్లేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్ము యాదగిరి వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జిట్ట నరేష్, కొల్లోజు శ్రీకాంత్, మెండె వెంకన్న, రెగొండ వేణు మాధవ్, చెరుపల్లి శ్రీనివాస్, గుండ్లపల్లి వెంకన్న, మూడ వెంకటాద్రి, కాలిన శ్రీశైలం పాల్గొన్నారు.

వ్యభిచార స్థావరంపై పోలీసుల దాడులు

నకిరేకల్ : పట్టణంలోని వాసవీ నగర్‌లో గల ఓ హోటల్‌లో వ్యభిచారం జరుగుతోందని సమాచారం మేరకు శుక్రవారం స్థానిక సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ కృష్ణమాచారి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో నలుగురు మహిళలు, నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

వారంలోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

తిప్పర్తి : వారంలోగా మండలంలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని తిప్పర్తి తహసీల్దార్ పరుశురాం నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మామిడాల, గోదోరిగూడెం, ఆరెగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. ధాన్యం కొనుగోలు అయినే వెంటనే రైతుల ఖాతాలో నగదు జమ అయ్యేలా చూడాలన్నారు.

రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి మొక్కుబడి కల్యాణం

కనగల్ : భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి శుక్రవారం భక్తులు మొక్కుబడి కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు బోనాలతో వచ్చి అమ్మవారిని నైవేద్యం సమర్పించారు. మహిళా భక్తులు పసుపు, కుంకుమతో అభిషేకం నిర్వహించారు. చీర, సారె, ఒడిబియ్యం సమర్పించారు. కోరిన కోర్కెలు తీరాలని వేప కొమ్మలకు ముడుపులు కట్టారు.

'కూసుకుంట్ల'ను విమర్శించడం సరికాదు

మునుగోడు: నియోజకవర్గ అభివృద్ధికి శ్రమించిన మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని విమర్శించడం సరికాదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మందుల సత్యం అన్నారు. శుక్రవారం మునుగోడులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి శంకుస్థాపనలు చేస్తే వాటిని ధ్వంసం చేయడం వల్లే తాము ప్రశ్నించామన్నారు. కాంగ్రెస్ నాయకులు పాత శిలాఫలకాల జోలికి పోకుండా నూతనంగా మంజూరైన పనులకు మాత్రమే శంకుస్థాపనలు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మాదరబోయిన పరమేష్, మారగోని అంజయ్య, జంగిలి సాంబయ్య, కరుణాకర్, సురేందర్, విజయ్, రాజేష్, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతులకు తీరని నష్టం


రాంరెడ్డిపల్లిలో నేలకొరిగిన వరిచేను


కమ్మగూడలో ఈదురు గాలులకు నేలకొరిగిన మొక్క జొన్న చేను

- ఆర్థికంగా దెబ్బతిన్న రైతాంగం
- పెట్టుబడి కూడా రాని పరిస్థితి
- నష్టపరిహారం అందించాలని వేడుకోలు

మర్రిగూడ : ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంట అకాల వర్షాలు, ఈదురుగాలు కారణంగా నేలకొరగడంతో రైతుల ఆశలన్నీ అడియాశలయ్యాయి. చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో ఆర్థికంగా రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది మర్రిగూడ మండల వ్యాప్తంగా యాసంగిలో 5,693 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 75శాతం వరికోతలు పూర్తవగా 25శాతం కోతలు మిగిలి ఉన్నట్లు సమాచారం. ఎకరా సాగుకు దుక్కిదున్ని పంట కోత కోసే వరకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు అవుతోంది. అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడంతో పెట్టిన పెట్టుబడికితోడు తమ కష్టం కూడా వృథా అయ్యిందని రైతులు వాపోతున్నారు.

రాలిన వరిధాన్యం..

అకాల వర్షం, ఈదురుగాలుల కారణంగా అనేక చోట్ల వరి చేలు నేలకొరిగాయి. దీంతో అక్కడక్కడ వరి ధాన్యం రాలిపోయింది. ఈ ఏడాది ఇప్పటికే తెగుళ్ల సోకి కొంత నష్టం వాటిల్లినప్పటికీ అకాల వర్షం, ఈదురుగాలుల కారణంగా మరింత నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గుర్తించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నేలకొరిగిన మొక్కజొన్న..

మర్రిగూడ మండలంలోని దామెరభీమనపల్లి, కమ్మగూడ, భీమ్లతండా, వట్టిపల్లి, సరంపేట, ఇందుర్తి గ్రామాల్లో వంద ఎకరాలకు పైగా రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేలు పెట్టుబడి పెట్టామని, పంట చేతికొచ్చే సమయంలో పూర్తిగా నేలకొరగడంతో పెట్టిన పెట్టుబడి రాకపోగా చేసిన కష్టం కూడా వృథా అయ్యిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వీచిన ఈదురు గాలులకు పంట మొత్తం నేలకొరిగిందని తమకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆర్థికంగా నష్టపోయా



30 గుంటల భూమిలో వరిసాగు చేయగా కోత కొచ్చిన సమయంలో వర్షం, ఈదురుగాలులతో పంట నేలకొరిగింది. వరికోత మిషన్ కోసే సమయం ఎక్కువ పట్టింది. కొంత ధాన్యం మడుల్లోనే రాలిపోగా, పంట కోసే సమయంలో ఇబ్బందులు తలెత్తాయి. ఆర్థికంగా నష్టపోయా. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– నాగిళ్ల పాపయ్య, రైతు, రాంరెడ్డిపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



నాలుగు ఎకరాల మొక్క జొన్న పంట పూర్తిగా నేల మట్టమైంది. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లింది. పత్తి సాగు చేస్తే విత్తనాలు నాణ్యమైనవి రాక ఆ పంట కూడా దెబ్బతింది. రెండు పంటలు సాగుచేస్తే మొత్తం రూ.3 లక్షలకు పైగా అప్పులు చేయాల్సి వచ్చింది. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

– కొయ్య ఆరోగ్యయ్య, రైతు, కమ్మగూడ

ప్రాథమిక అంచనా వేశాం



మండల వ్యాప్తంగా వంద ఎకరాలు మొక్కజొన్న సాగు చేసినట్లు నమోదు చేశాం. 80 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. 33 శాతం నష్టం వాటిల్లితేనే పరిహారం అందుతుందని ఉన్నతాధికారులు తెలిపారు. అంతమేరకు నష్టం జరగలేదు. అదేవిధంగా వరి పంట నేలకొరిగినట్లు మా దృష్టికి రాలేదు.

– సాహస్, ఏఓ, మర్రిగూడ

మురికి కూపంలో కృష్ణా జలాల నల్లా


తిప్పర్తి మార్కెట్ యార్డులో మురికి నీటి మధ్య కృష్ణా జలాల నల్లా

తిప్పర్తి : మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కృష్ణా జలాలకు సంబంధించిన నల్లా ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో పనిచేసే హమాలీలు, లారీ డ్రైవర్లతోపాటు రోడ్డున పోయే ప్రయాణికులు, గ్రామస్తులు ఇక్కడ నీటిని పట్టుకుని పోతుంటారు. అయితే నల్లా చుట్టూ ప్లాట్ ఫాం లేకపోవడంతో మురికి కూపంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది.

కబ్జా భూమిని వెంటనే స్వాధీనం చేసుకోండి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 78లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకుని ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు కేటాయించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం మునుగోడులోని సర్వే నంబర్ 78లో గల ప్రభుత్వ భూమిని చండూరు ఆర్‌డీఓ శ్రీదేవి, తహసీల్దార్ నరేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మిస్తే అందరికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అధికారులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న భూమికి మ్యాప్ వేసి వెంటనే పాఠశాలకు అప్పగించాలన్నారు. అధికారులు, ప్రజలు సహకరిస్తేనే అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట రెవెన్యూ అధికారులు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, కాంగ్రెస్ నాయకులు పాల్వాయి జితేందర్‌రెడ్డి, ఎండీ అన్వర్, వెంకన్న తదితరులు ఉన్నారు.

'సాక్షి' ఎడిటర్ ఇంటిపై దాడికి నిరసనగా ర్యాలీ



నిరసన ర్యాలీలో పాల్గొన్న జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు

నకిరేకల్ : ఏపీలోని విజయవాడలో సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసుల దాడిని ఖండిస్తూ నకిరేకల్ పట్టణంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మెయిన్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల గుండా సాగింది. ఏపీ పోలీసుల జులుం నశించాలని జర్నలిస్టులు, ఆయా పార్టీల నాయకులు నినాదాలు చేశారు. మెయిన్ సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి, బొల్లికొండ లింగయ్య, రైతుకూలి సంఘం రాష్ట్ర నాయకుడు గజ్జి రవి, బీఆర్‌ఎస్ నేత యల్లపురెడ్డి సైదిరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ వంటెపాక అంబేద్కర్‌లు మాట్లాడుతూ విజయవాడలో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో జరిగిన దాడిని అందరూ ఖండించాలన్నారు. అర్ధరాత్రి ఇంట్లో సోదాలు చేసి కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. ఏపీ ప్రభుత్వ తీరు సరికాదన్నారు. ఏమైనా ఆరోపణలు ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి తప్ప ఇలాంటి చర్యలకు ఏపీ పోలీసులు పూనుకోవడం తగదన్నారు. ఏపీ ప్రభుత్వం, పోలీసుల తీరుపై అన్ని పార్టీలు పోరాటం చేసి ఎండగట్టలన్నారు. సాక్షి నియోజకవర్గ రిపోర్టర్ వి.రామసాయిలు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి వీరస్వామి, జర్నలిస్టులు చెరుకు సతీష్, రాములు, రేపాల సతీష్, ఎస్.వంశీ కృష్ణ, కొల్లు నరేష్, పి.వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, సాయి, కందగట్ల శ్రీధర్, రామగిరి వెంకటేశ్వర్లు, నిజం మోహన్, విజయ్‌రెడ్డి, నర్సింహ, శంకర్, నాయకులు చెరుకు వెంకటాద్రి, వంటెపాక సుందర్, మామిడి రమేష్, గగ్గేనపల్లి జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మర్రిగూడ : మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామానికి చెందిన సిరుసాల సైదమ్మకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.16వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శుక్రవారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఊరిపక్క జంగయ్య అందజేశారు. కార్యక్రమంలో పోతురాజు ఆంజనేయులు, మహ్మద్ జావిద్, బురుకల రాములు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మండల కేంద్రానికి చెందిన ఆమంచ ధనమ్మకు మంజూరైన రూ.44వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జమ్ముల వెంకటేష్, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, ఎలిమినేటి సత్తిరెడ్డి, పానుగోటి శేఖర్,పల్లె మల్లేష్, ఈద రాములు, శ్రీను నాయక్, ఎండీ.అశ్వక్, షర్ఫొద్దిన్, ఆనంద్, నజీర్, పగడాల అంజయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన గుండ్లపల్లి లింగమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న శివన్నగూడ శ్రీ నీలకంఠ రామస్వామి దేవస్థానం చైర్మన్ రాపోలు యాదగిరి శుక్రవారం లింగమ్మ భర్త శ్రీనును పరామర్శించి రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట చిట్యాల రంగారెడ్డి, సోమయ్య యాదవ్, ఆకుల యాదయ్య, ఇరుగుదిండ్ల సత్తయ్య, గుండ్లపల్లి దశరథ, గుండ్లపల్లి భాస్కర్ ఉన్నారు.

అనాథలకు ఇల్లు కట్టించిన యువకులు


నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం


యువకులు నిర్మించిన ఇల్లు

గట్టుప్పల్ : వైకల్యానికితోడు మానసిక పరిస్థితి బాగాలేని అనాథలకు ఆ గ్రామంలోని పద్మశాలి యువకులు అండగా నిలిచారు. వారికి ఇల్లు నిర్మించి ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. వివరాలు.. గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన చిలుకూరి వెంకయ్య–పుల్లమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు అంజయ్య, సత్తయ్య. వీరికి వైకల్యంతోపాటు మానసిక స్థితి బాగోలేదు. ఇద్దరు కుమారులు చిన్నగా ఉండగానే తండ్రి వెంకయ్య మృతి చెందాడు. తల్లి చేనేత పనులు చేస్తూ కొంతకాలం కుటుంబ పోషణ చేసింది. 8 నెలల క్రితం తల్లి కూడా అనారోగ్యంతో ప్రాణాలు వదిలింది. ఇద్దరు కుమారులకు ఇల్లు లేదు... అన్నం పెట్టేవారు లేకుండా పోయారు. దీంతో ఆ అనాథల కోసం మండల కేంద్రానికి చెందిన పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు పున్న కిశోర్ నేత ఆధ్వర్యంలో సంఘం సభ్యులు రెండు గదుల రేకుల ఇంటిని నిర్మించారు. ఆ గృహాన్ని మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం శుక్రవారం ప్రారంభించారు. నామని జగన్నాథం, నామని గోపాల్, పున్న ఆనంద్, బుచ్చయ్య, సత్తయ్య, అంజయ్య, లింగయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

రశీదులు ఇస్తలేరు.. కటింగ్ పెడుతున్నారు


రైతులతో మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటేష్

చిట్యాల: వెలిమినేడు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే రశీదులు ఇవ్వడం లేదని, క్వింటాలుకు ఐదు కేజీల వరకు రైస్ మిల్లర్లు కటింగ్ చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని పలువురు రైతులు వాట్సాప్ ద్వారా శుక్రవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి మొరపెట్టుకున్నారు. స్పందించిన కలెక్టర్.. డీఎస్‌ఓ వెంకటేష్‌ను సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. వివరాలు.. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేసిన ధాన్యం మిర్యాలగూడ పరిధిలోని రైస్‌మిల్లర్స్‌కు రవాణా చేస్తున్నారు. అక్కడి రైస్ మిల్లర్లు పలు కారణాలు చూపుతూ లారీల్లో వచ్చిన ధాన్యాన్ని రోజులు తరబడి దిగుమతి చేసుకోకుండా నిలిపివేస్తున్నారు. దీంతో వెలిమినేడుకు చెందిన రైతు చీమల శ్రీను వాట్సాప్ ద్వారా కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వెలిమినేడు గ్రామంలోని రైతు వేదికలో రైతులతో డీఎస్‌ఓ వెంకటేష్ సమావేశమయ్యారు. తాము రోజుల తరబడి ఎండకు ఎండబెట్టి ధాన్యం విక్రయిస్తే దిగుమతి సమయంలో రైస్ మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని రైతులు వివరించారు. అంతేకాకుండా క్వింటాలు ధాన్యంకు ఐదు కేజీల కటింగ్ పెడతామని, లేకపోతే ధాన్యం దిగుమతి చేసుకోబోమని మిల్లర్లు తెలుపుతున్నారని రైతులు డీఎస్‌ఓకు వివరించారు. ధాన్యం ఎగుమతి విషయంలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని డీఎస్‌ఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణనాయక్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ దీపక్, ఏఓ గిరిబాబు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ : జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు వారిని కోర్టులో హాజరుపరిచారు. వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు వన్‌టౌన్ ఎస్‌ఐ వి.శంకర్ తన సిబ్బందితో నల్లగొండ పట్టణంలోని తులసీనగర్, కట్ట మైసమ్మ గుడి ఏరియాలో తనిఖీ చేస్తుండగా గంజాయి విక్రయిస్తున్న తులసీనగర్ బాహార్‌పేటకు చెందిన జొన్నల రవీందర్, గంజాయి కొనుగోలుదారు యానక నరేష్‌పాల్ పట్టుబడ్డారు. జొన్నల రవీందర్ నుంచి కిలో 300 గ్రాముల గంజాయి, మ్యాస్ట్రో మోటార్ సైకిల్, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. యానక నరేష్ నుంచి రూ.500 నగదు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రవీందర్ తన స్నేహితురాలు జమ్మలగూడ నివాసి రమ్యకృష్ణ, పింకీ కొంతకాలంగా గంజాయి తాగుడుకు అలవాటుపడ్డారు. అదేక్రమంలో అక్రమ లాభార్జన కోసం గంజాయిని హైదరాబాద్ ధూల్‌పేట నుంచి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి, కొంత తమ సొంతానికి వాడికుని మిగతాది ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ఈ క్రమంలో 4 రోజుల క్రితం రవీందర్ 1.5 కేజీల గంజాయిని ధూల్‌పేట నుంచి తీసుకొచ్చాడు. కొంత వాడుకుని మిగతాది పట్టణంలో అమ్మారు. శుక్రవారం ఉదయం కట్ట మైసమ్మ గుడి సమీపంలో యానక నరేష్ పాల్‌కు గంజాయి అమ్ముతుండగా నమ్మదగిన సమాచారం మేరకు పోలీస్‌లు దాడి చేసి పట్టుకున్నారు.

కనులపండువగా మారమ్మ తల్లి పండుగ


బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

నార్కట్‌పల్లి : మండలంలోని నెమ్మాని గ్రామంలో శుక్రవారం మారమ్మ తల్లి పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో మాజీ జెడ్పీటీసీ అలుగుబెల్లి రవీందర్ రెడ్డి, అలుగుబెల్లి ఉపేందర్‌రెడ్డి, ఏళ్ల చలపతిరెడ్డి, గంట్ల మధుసూదన్‌రెడ్డి, బాణాల వెంకట్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, బుర్రి ఎల్లేష్, బుర్రి వీరయ్య, వంగాల రాజశేఖర్‌రెడ్డి, పైళ్ల దశరథ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

నార్కట్‌పల్లి : భార్యలను ఇంటి నుంచి గెంటేసిన తండ్రి, కొడుకులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బద్దుల యాదమ్మ, బద్దుల మల్లేశ్వరి(అత్తాకోడలు) తమ ఇంటి ముందు చేపట్టిన దీక్ష శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షలో సరోజపాల్గొని సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకులు లింగాల మల్లమ్మ, దైద సాయమ్మ, జిల్లా లింగమ్మ, జిట్ట యాదమ్మ, లక్ష్మమ్మ, ఎల్లమ్మ, రేణుక, సత్తమ్మ ఉన్నారు.

స్నేహితుడి కుమారుడికి ఆర్థికసాయం

శాలిగౌరారం: మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన దివ్యాంగుడైన చిన్నారి ముక్కాంల సృజన్(08)కు అతడి తండ్రి ముక్కాంల నాగరాజుతో కలిసి చదువుకున్న ఎస్సెస్సీ 2006–07 బ్యాచ్ సహచరులు శుక్రవారం రూ.11,500 అందజేశారు. మండలంలోని అంబారిపేటకు చెందిన ముక్కాంల నాగరాజు 2019 లో గొర్రెలను మేపుకొని ఇంటికి తిరిగి వస్తుండగా పిడుగు పడి మృతిచెందాడు. అప్పుడు సృజన్ వయస్సు రెండు సంవత్సరాలు. భర్త మృతిచెందడం, కుమారుడు దివ్యాంగుడు కావడంతో సృజన్ తల్లి కుమారుడిని అత్తమామల దగ్గర వదిలి తల్లిదండ్రులతో వెళ్లిపోయి మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. దివ్యాంగుడైన సృజన్‌ను తాత, నానమ్మ ముక్కాంల భిక్షమయ్య, సత్తమ్మలతో పాటూ బాబాయి నరేశ్‌లు సాకుతున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మర్రిగూడ : కేంద్రం ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగూరి నరసింహ కోరారు. శుక్రవారం మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు చేపట్టే ప్రదేశంలో కూలీలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లుకు పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎండీ.జానిమియా, జక్కరి అంజయ్య, ఎడ్ల యాదయ్య, లపంగి పెద్ద రాములు, మాదగోని యాదయ్య, చిన్న రాములు, సరిత, లక్ష్మమ్మ, ముత్తమ్మ, లలిత, లక్ష్మమ్మ, సుశీల పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా వినూత్న ప్రచారం


కరపత్రం అందజేస్తున్న ప్రభాకర్

నార్కట్‌పల్లి : యువత డ్రగ్స్‌కు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరెంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో జరిగిన సంతలో యువతకు, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి మైక్ ద్వారా వినూత్న ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం డ్రగ్స్‌పై రూపొందించిన కరపత్రాన్ని తహసీల్దార్ వెంకటేశ్వరావుకు అందజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ సెలవు దినాల్లో యువతకు తన సందేశం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ప్రభాకర్ తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నాంపల్లి : మండల కేంద్రంలోని రామాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం రాముల వారు, ఆంజనేయస్వామి విగ్రహాల, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు కల్యాణం మహోత్సవం జరిపి తలంబ్రాలు పోశారు. వేడుకల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ కోట రఘునందన్, ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి ఆనంద్, ఉమానాగలింగేశ్వర ఆలయ చైర్మన్ పెద్దిరెడ్డి అనంతరెడ్డి, పూల వెంకటయ్య, పెద్దిరెడ్డి రాజు, గణేశ్, గోపికృష్ణ, పున్న కోటయ్య, కర్నాటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి


దరఖాస్తులు స్వీకరిస్తున్న గోలి ప్రభాకర్

కేతేపల్లి: రాబోయే పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు 5శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కేతేపల్లి మండలంలోని కొండకిందిగూడెం గ్రామంలో ఆయన పర్యటించి సమస్యలపై దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లను రూ.4వేల నుంచి రూ.6వేల వరకు పెంచాలని కోరారు. అదేవిధంగా దివ్యాంగులకు వైకల్యం శాతంతో సంబంధం లేకుండా ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంజయ్య, పాల్వాయి రదీప్, ముక్కాముల సిరి, నర్సింగ్ సుప్రియ, దొంతం వెంకటసాయి, వంగూరి రాబర్ట్ పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

చిట్యాల: సుంకెనపల్లి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యపై ఈ నెల 7వ తేదీన సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన 'సుంకెనపల్లిలో నీటి కష్టాలు' కథనానికి అధికారులు శుక్రవారం స్పందించారు. సుంకెనపల్లిలో గ్రామంలోని ఎనిమిదో వార్డులో నీటి పైప్‌లైన్‌కు మరమ్మతులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యం, పంచాయతీ కార్యదర్శి అంజయ్య చేపట్టారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి దిన పత్రికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.